రైల్వే స్టేషన్‌కు కొత్త హంగులు


పిఠాపురం రైల్వే స్టేషన్ పాత భవనం


రైల్వే స్టేషన్ కొత్త భవనం

- అధునాతన ఆటోమెటిక్ సిగ్నల్ సిస్టం
- విశ్రాంతి భవనాలు, కొత్త టికెట్ కౌంటర్ల ఏర్పాటు

పిఠాపురం: దక్షిణ మధ్య రేల్వేలో పిఠాపురం రైల్వే స్టేషన్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతున్న పిఠాపురానికి ప్రతి నిత్యం వందలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారు. అందుకే ఇక్కడ ప్రధాన రైళ్లకు సైతం హాల్టు కల్పించారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పిఠాపురం రైల్వే స్టేషన్ కొత్త హంగులు దిద్దుకుంటోంది. కాకినాడ ఎంపీ వంగా గీత చొరవతో రైల్వే శాఖ సుమారు రూ.2 కోట్లు కేటాయించడంతో అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.


ప్రధాన సమస్యలకు పరిష్కారం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ దృష్టికి తీసుకొవచ్చారు. ఆమె కేంద్ర రేల్వేశాఖ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వెంటనే చర్యలు తీసుకునేలా ఒత్తిడి తేచ్చారు. దీంతో కొన్ని నెలల వ్యవధిలోనే రెండు ప్రధాన రేల్వే గేట్ల సమస్యకు పరిష్కారం లభించింది. పిఠాపురంలో మాధవపురం రేల్వే గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి రూ.5.26 కోట్లు మంజూరయ్యాయి. దీని నిర్మాణ పనులు పూర్తవడంతో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. గోర్స రేల్వే గేటు వద్ద రూ.5.20 కోట్లతో ఆర్‌యూబీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో పాటు ఉప్పాడ రైల్వే గేటు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ రావడంతో పాటు రూ.100 కోట్లు మంజూరు కావడంతో అన్ని సమస్యలకు పరిష్కారం లభించనుంది.


ఆధునీకరించిన ప్లాట్‌ఫాం


కొత్త టికెట్ కౌంటర్

అభివృద్ధికి మరిన్ని చర్యలు



పిఠాపురం రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే రూ.2 కోట్లతో అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని పనులు పూర్తి కావచ్చాయి. త్వరలో వీటిని ప్రారంభించనున్నాం. పిఠాపురం ఉప్పాడ రేల్వే గేటు ప్రధాన రహదారిలో ఉండడంతో ఇక్కడ రేల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ అనుమతులు ఇచ్చింది పనులు ప్రారంభించారు. ఇక ప్రజల ఇబ్బందులు తీరనున్నాయి.

– రావుల మాధవరావు జెడ్‌ఆర్‌యూసీసీ మెంబరు, పిఠాపురం

అభివృద్ధి పనులు ఇవే..

రూ.2 కోట్లతో రైల్వే స్టేషన్‌లో కొత్త టిక్కెట్ కౌంటర్, మహిళలకు ప్రత్యేక విశ్రాంతి భవనాలు, రెండు ప్లాట్‌ఫాంలపై అధునాతన సిగ్నల్ వ్యవస్థ, ఇండికేటర్లు ఏర్పాటు చేశారు. మంచినీటి వసతి, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్ రూపురేఖలు మొత్తం మారిపోయేలా అధునాతన భవనాలను నిర్మించారు. త్వరలో వీటినీ ప్రారంభించనున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న శిశు సంక్షేమ అధికారి రుద్ర సురేష్

సామర్లకోట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పోషకాహారాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ వైస్ ఎంపీపీ ములసా శ్రీను అన్నారు. పోషకాహర మాసోత్సవాల్లో భాగంగా మండల పరిధిలో శుక్రవారం పనసపాడు, అచ్చంపేట గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని తల్లులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో అనేక పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను అందిస్తున్నారని అన్నారు. చైల్డ్ వెల్ఫేర్ అధికారి ఎస్.రుద్రసురేష్ మాట్లాడుతూ మూడు నుంచి ఆరు ఆరేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలోని ప్రీ స్కూల్స్‌కు పంపాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, హెల్త్ సిబ్బంది నానాజీ, ఎం.కుమారి, బి.విజయశాంతి, ఎంఎస్‌కే హేమ, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు బదిరెడ్డి బుజ్జి, వీరంరెడ్డి నాని, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సామూహిక సరస్వతీ పూజలు


సరస్వతీ పూజలు చేస్తున్న చిన్నారులు

సామర్లకోట: స్థానిక గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన 12 అడుగుల గణపతి విగ్రహ శిబిరం వద్ద శుక్రవారం రాత్రి చిన్నారులచే సామూహిక సరస్వతి పూజలు నిర్వహించారు. నిర్వాహకులు చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పూజా సామగ్రి అందజేసి పూజలు చేయించారు. పట్టణంలో అతి పెద్ద విగ్రహం ఇదే కావడంతో ప్రతి రోజు అనేక మంది గణపతి విగ్రహాన్ని తిలకించడానికి వస్తున్నారు. నిర్వాహకులు వరాలు, ప్రసాద్, సత్తిబాబు, సుబ్బారావు, శ్రీనివాసులు సేవలందించారు.

మరచిన ట్రాలీ బ్యాగ్ యజమానికి అందజేత


బ్యాగ్‌ను అంజలికి అందజేస్తున్న జీఆర్పీ సిబ్బంది

సామర్లకోట: స్థానిక రైల్లే స్టేషన్ మూడో ప్లాట్ ఫాంపై ఓ ప్రయాణికుడు మరచిపోయిన ట్రాలీ బ్యాగ్‌ను అతని భార్య ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు బాధితులకు అందజేశారు. ఈనెల 20న కాకినాడకు చెందిన ఉగ్గిన మనోహర్ సామర్లకోట రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫాం నుంచి గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వెళ్లారు. రైలు ఎక్కే హడావిడిలో ప్లాట్ ఫాంపై ట్రాలీ బ్యాగ్ మరచి పోయారు. రైలు ఎక్కిన తరువాత బాధితుడు తన భార్య అంజలికి సమాచారం ఇచ్చారు. దాంతో ఆమె సామర్లకోట జీఆర్పీ పోలీసు స్టేషన్‌లో ట్రాలీ బ్యాగ్‌పై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రైల్వే ఎస్సై బి.లోవరాజ సిబ్బంది సహకారంతో బ్యాగ్ వెతికించి భద్రపరచి శుక్రవారం ఆమెకు అందజేశారు. జీఆర్పీ సిబ్బంది పని తీరుపై రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ హర్షం వ్యక్తం చేశారు.

నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి

- ఇన్‌చార్జి డీఈఓ నాగమణి


వాకతిప్పలో తరగతి గదులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఈఓ నాగమణి

కొత్తపల్లి: నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు ధీటుగా అభివృద్ధి చేసినట్టు ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖాధికారి జి.నాగమణి అన్నారు. వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం ఇసుకపల్లిలో ఎంపీపీ పాఠశాలను సందర్శించి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగనన్న గోరుముద్ద, వసతి దీవెన, ఫీజు రీ ఎంబర్స్‌మెంటు, విదేశీ విద్య, జగనన్న విద్యా కానుక వంటి పథకాల ద్వారా విద్యను ప్రోత్సహిస్తుందన్నారు. నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట ఎంఈఓ వేణుగోపాల్ ఉన్నారు.

అనారోగ్యం కారణంగానే మృతి

వైద్యాధికారి మౌనిక

కొత్తపల్లి: వాకతిప్ప గ్రామంలో ఒక వ్యక్తి డెంగీ కారణంగా మృతి చెందలేదని కొద్ది రోజులుగా లీవర్ సమస్యతో బాధ పడుతూ మృతి చెందినట్టు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మౌనిక శుక్రవారం తెలిపారు. డెంగీ జ్వరం నిర్ధారణ పరీక్ష కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రమే ఉందన్నారు. డెంగ్యూతో మృతి చెందినట్టు అధికారికంగా సమాచారం రాలేదన్నారు.

అలరించిన గాత్ర కచేరీ

కాకినాడ కల్చరల్: స్థానిక శ్రీరామ సమాజం 129వ గణపతి సంగీత హరికథా మహోత్సవాలలో భాగంగా ఐదో రోజు సూర్యకళా మందిరంలో హైదరాబాద్‌కు చెందిన ఐ.శ్వేతప్రసాద్ గాత్ర కచేరీ ప్రేక్షకుల హృదయాలను ఓలలాడించింది. వీరు నాట రాగంలో నిన్నే భజన ఖరహరప్రియ రాగంలో ప్రక్కాన నిలాబడి, వలజి రాగంలో జాలంధర కీర్తనలు రసవత్తరంగా పాడి ప్రేక్షకుల మన్ననలు పొందారు. వీరికి వయోలిన్‌పై కోలంక సాయికుమార్, ఐ.రేణుక ప్రసాద్, ఘటంపై శ్రీరామకృష్ణ సహకారాన్ని అందించారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన

- వైఎస్సార్ సీపీ పాలనలో గ్రామీణాభివృద్ధి
- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి

పెద్దాపురం: సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని వడ్లమూరు గ్రామంలో సుమారు రూ.80 లక్షలతో చేపట్టిన ఆర్బీకే, జల్‌జీవన్ మిషన్, గడపగడపకు మన ప్రభుత్వం నిధుల కింద చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైన్లను శుక్రవారం జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీలు కంటే వీరప్రభావతి, మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవులతో కలిసి ప్రారంభించారు. వీర్రాఘవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దవులూరి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల, రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. మెరుగైన పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. తొలుత దొరబాబు ఆర్బీకే, తాగునీటి కుళాయి, రోడ్లు, డ్రైన్లను ప్రారంభించారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కళ, ఏడీఏ దైవకుమార్, ఏఓ సంజయ్‌కుమార్, మండల కో-ఆప్షన్ సభ్యులు బిక్కిన శేషకుమారి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు యినకొండ వీర విష్ణుచక్రం తదితరులు పాల్గొన్నారు.


వడ్లమూరులో ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న దొరబాబు

వాస్తవ ఘటనలతో 'వారెవ్వా జతగాళ్లు'

- సినీ రంగంలో గుర్తింపు పొందేలా నిర్మాణం
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి

సామర్లకోట: తమిళనాడులో జరిగిన ఒక వాస్తవ ఘటనల ఆధారంగా నిర్మించిన 'వారెవ్వా జతగాళ్లు' చిత్రం సినీ రంగంలో మంచి గుర్తింపు పొందుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పెద్దాపురం మహారాణి కళాశాల పూర్వ విద్యార్థులు ఈ చిత్రాన్ని నిర్మించి విడుదల చేయగా స్థానిక జయలక్ష్మి థియేటర్‌లో దొరబాబు ఈ చిత్రాన్ని చూసి అభినందించారు. చిత్ర దర్శకుడు సత్య సలాది స్థానిక విలేకర్లకు సినిమా విశేషాలను వివరిస్తూ ఐదు భాషల్లో దేశ వ్యాప్తంగా సుమారు 500 థియేటర్లలో రిలీజ్ చేసినట్టు తెలిపారు. తన స్వగ్రామం స్థానిక ఉండూరు అని, స్థానిక నటులతో పెద్దాపురంలో ఎస్ఎస్ ఫిలిం అకాడమీని ఏర్పాటు చేసి చిత్రీకరించినట్టు తెలిపారు. తారాగణం పోసాని కృష్ణమురళి, జబర్దస్త్ మురళి, కన్నడ నటుడు రాబర్ట్ లూయిస్, ప్రియాంక, మమత తదితరులతో ఈ చిత్రాన్ని నిర్మించినట్టు తెలిపారు. జిల్లాకు చెందిన సాయి పవన్, పిట్టా లక్ష్మణ్, రాజబాబు, అరవింద స్వామిలను కథానాయకులుగా పరిచయం చేసినట్టు తెలిపారు. పులిమేరు గ్రామానికి చెందిన బండారు నాగబాబు, దొడ్డి వీర ప్రభాకర్, పిఠాపురానికి చెందిన గరగ వీరబాబు నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.


చిత్ర బృందాన్ని అభినందించిన హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి

చేబ్రోలులో పశువైద్య శిబిరం

పిఠాపురం: జిల్లా పశుసంవర్థక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గొల్లప్రోలు ఏడీ ఎం.శ్రీనివాసరావు, చేబ్రోలు పశు వైద్యాధికారి హిమజలు సుమారు 135 పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గొల్లప్రోలు ఏడీ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతు ప్రస్తుత వర్షాకాలంలో పశువులు పలు వ్యాధులకు గురవుతుంటాయని, టీకాలు వేయించాలని సూచించారు. ఈ శిబిరంలో పశువులకు, మేకలు, కోళ్లకు గర్భకోశ సంబంధించిన వ్యాధులు, చూడి పరీక్షలు, పొదుగు వాపు, ముద్ద చర్మ వ్యాధి, వంటి వాటికి పరీక్షలు చేసి టీకాలు వేశామన్నారు. ఈకార్యక్రమంలో రిలయన్స్ పౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ బర్రే నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ ఓరుగంటి చక్రధరరావు, పవు వైద్య సిబ్బంది అజయ్, అఖిల్, నాగేశ్వరరావు ఆంజనేయులు, రిలయన్స్‌పౌండేషన్‌సిబ్బంది యు రమేష్‌బాబు పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.


ఉచిత పశు వైద్య శిబిరంలో రైతులకు మందులు పంపిణీ చేస్తున్న అధికారులు

ఉత్తమ సేవలకు గుర్తింపు


పదోన్నతులు పొందిన వారిని అభినందిస్తున్న స్టేషన్ మేనేజరు రమేష్ తదితరులు

- పాయింట్స్ మెన్‌లకు పదోన్నతులు
- అభినందించిన స్టేషన్ మేనేజర్ రమేష్

సామర్లకోట: ఉత్తమ సేవలందించే వారికి గుర్తింపు ఉంటుందని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో పాయింట్స్ మెన్లుగా విధులు నిర్వహిస్తున్న ఎస్.శంకర్, ఎల్.సతీష్‌కుమార్, పి.విజయకుమార్, నిరంజన్‌కుమార్, వై.సూరిబాబు, డి.అప్పారావులకు గూడ్స్ మేనేజర్లుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారి సేవలను స్టేషన్ మేనేజర్ అభినందించారు. వారిలో ఐదుగురికి రాజమహేంద్రవరంలోను, ఒకరికి కాకినాడలో పోస్టింగ్‌లు వచ్చి న్నట్టు రమేష్ తెలిపారు. వారికి రిలీవ్ మెమోలు జారీ చేసి బదలీలు చేశారు. ఆర్పీఎఫ్ ఎస్సై ఎన్.రామకృష్ణ, స్టేషన్ మాస్టర్ అనంతలక్ష్మి, సూపరింటెండెంట్ శ్రీధర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్

స్వచ్ఛ భారత్ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారాలను, పరిసరాలను శుభ్రం చేశారు. స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజర్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పిలుపు నిచ్చారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్ కిశోర్, బుకింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, స్టేషన్ మాస్టర్లు అనంతలక్ష్మి, శ్రీనివాసు, ఆర్పీఎఫ్ ఎస్సై ఎన్.రామకృష్ణ, జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా సీఎం జగన్

- హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి
- పనసపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

సామర్లకోట: అన్ని వర్గాలకు అండగా, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం వైస్ ఎంపీపీ ములసా శ్రీను, పార్టీ గ్రామ నాయకులు మానేపల్లి చిట్టిబాబు, బదిరెడ్డి బుజ్జి, కాళ్ల శ్రీనివాసు, అనుసూరి రమణ ఆధ్వర్యంలో దొరబాబు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో పలు పార్టీలు ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రజలు గమనించాలన్నారు. వివిధ పథకాల లబ్ధిదారులను కలసి మూడేళ్లలో పొందిన లబ్ధిని వివరించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, పంచాయతీ కార్యదర్శి అమరనాథ్‌రెడ్డి, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు మార్కెట్ కమిటీ వైస్‌చెర్మన్ మోరంపూడి రమేష్, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు 2 పేర్నిడి రాయుడు, సీబీ దేవం ఎంపీటీసీ సభ్యుడు రాయి వెంకటేశ్వర రావు, హుస్సేన్‌పురం ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్, వీఆర్వోలు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరా


తాగనీటి పథకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులకు తాగునీటి పథకం ద్వారా పూర్తి స్థాయిలో తాగునీరు అందిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాస్ అన్నారు. వాకతిప్పలో ఉన్న నాగులాపల్లి ఏరియా పరిసర గ్రామాల తాగునీటి పథకాన్ని శుక్రవారం జిల్లా పరిషత్ ఈసీఓ రమణారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. సమ్మర్ స్టోరేజ్ చెరువు, ఫిల్టర్ బెడ్‌లు పనితీరును అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.సంధ్య ఉన్నారు.

నిమజ్జనాల్లో అవరోధాలు లేకుండా చర్యలు తీసుకోవాలి

ఆర్డీఓ సత్యనారాయణ


ఉప్పాడ తీరప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

కొత్తపల్లి: గణేశ్ నిమజ్జనాల్లో అవరోధాలు జరగకుండా అధికారులు సమన్వయంతో తగు చర్యల తీసుకోవాలని ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. నిమజ్జనం చేయనున్న ఉప్పాడ తీరప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ నిమజ్జన సమయంలో కమిటీ సభ్యులు నిబంధలను పాటించేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా తీరప్రాంతాలకు పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కిర్లంపూడి, పెద్దాపురం మండలాల నుంచి అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకొస్తారని, ఆ సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. తీరంలో తాగునీరు, పారిశుధ్యం, లైటింగ్, గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై స్వామి నాయుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఉన్నారు.

25న వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈనెల 25వ తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఇండస్ ఇండ్ బ్యాంక్‌లో లోన్ ఆఫీసర్, బజాజ్ కాపిటల్‌లో ఫైనాన్షియల్ అడ్వయిజర్, అపర్ణ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్‌లో ట్రైనీ ల్యాబ్ టెక్నీషియన్, నిట్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ ప్రొడక్షన్, సోలారా యాక్టివ్ ఫార్మా సైన్సెస్ కంపెనీలో ప్రొడక్షన్ టెక్నీషియన్, అపోలో టైర్స్, డిక్సాన్ అండ్ హుందాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు లచ్చారావు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్, ఆర్కిటెక్చర్, బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఉత్తీర్ణులైన 25 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు సోమవారం వికాస కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రీడలు


జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన బాలికలతో పీడీలు

సామర్లకోట/పెద్దాపురం: జూనియర్, సీనియర్ విభాగాలల్లో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో భాగంగా శుక్రవారం నియోజకవర్గ క్రీడా పోటీలు ముగిసాయి. పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో నియోజకవర్గం నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు ఎంపిక కమిటీ కన్వీనర్ యార్లగడ్డ బంగార్రాజు తెలిపారు. శుక్రవారం అండర్ 14, 17 విభాగంలో బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయి పోటీలకు 332 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై నట్టు బంగార్రాజు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యా యులు వరుస దానం, ఉమామహేశ్వర రావు, వెంకటేశ్వర్లు, విశ్వేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, ఇబ్రహీం, వీరబాబు, శ్రీనివాసు, సునయన, జయలక్ష్మీ, అరుణ, రవి, లక్ష్మీ, శేఖర్‌లు పోటీలను నిర్వహించారు. ఎంఈఓలు శర్మ, రామకృష్ణ చౌదరి, వై శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్యలు పాల్గొన్నారు.

జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

సామర్లకోట: స్కూల్ గ్రేమ్స్‌లో భాగంగా స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై నట్టు హెచ్ఎం మీనామాధురి, పీడీ జి.శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం పెద్దాపురం మహారాణి కళాశాలలో జరిగిన పెద్దాపురం నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ అండర్ 17 విభాగంలో మాధురి, రిచ్చా, ఐశ్వర్య, అండర్-14 విభాగంలో అరుణశ్రీ, శ్రీవల్లి, లాస్య, యోగా అండర్-17 విభాగంలో అనిత, అఖిల, అండర్-14 విభాగంలో కుసుమ, త్రోబాల్ అండర్-17లో శారద, అండర్-14లో ప్రియాంక ఎంపికైనట్టు హెచ్ఎం వివరించారు.

జిల్లా స్థాయి షాట్‌పుట్ పోటీలకు సుబ్రహ్మణ్యం

సామర్లకోట: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు నవర జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి జి.సుబ్రహ్మణ్యం ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం ఎంవీవీ గోపాలరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గురువారం నియోజకవర్గ స్థాయిలో పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో జరిగిన సీనియర్ బాయ్స్ షాట్‌పుట్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించారన్నారు. ఈ మేరకు త్వరలో కాకినాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారని అన్నారు. వ్యాయమ ఉపాధ్యాయిని ఎ.వెంకటలక్ష్మి ఈ మేరకు శిక్షణ ఇస్తారన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన గోపాలరావును ఉపాధ్యాయులు బి.శ్రీకాంత్, జీవీవీ సత్యనారాయణ, ఎ ఆదినారాయణ అభినందించారు.


సుబ్రహ్మణ్యాన్ని అభినందిస్తున్న హెచ్ఎం గోపాలరావు

ప్రజలు పోలీసులతో మమేకం కావాలి

కొత్తపల్లి: ప్రజలు పోలీసులతో మమేకం కావాలని, పోలీసులనే భయాన్ని వీడి ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఎస్సై స్వామినాయుడు అన్నారు. మండలంలోని పొన్నడ శివారు కోనపాపపేట శనివారం రాత్రి వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు, మహిళా భద్రత, పోలీసుల విధులపై చిత్రీకరించిన వీడియోను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు మధ్య దూరాన్ని తగ్గించేందుకు ఈ వారధి కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రమాదాలకు ముఖ్య కారణం మద్యం సేవించడం, అతి వేగంతో ప్రయాణించడమేనన్నారు. మహిళలకు రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రతి గ్రామ సచివాలయంలో మహిళా పోలీసులను నియమించారన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై స్వామినాయుడు

అన్యమత ప్రచారంపై ఆందోళన

పిఠాపురం: స్థానిక జై గణేష్ ఆలయం పక్కన కొందరు వ్యక్తులు హిందూ మతాన్ని కించపరిచేలా ఉన్న పుస్తకాలను అమ్ముతు అన్యమత ప్రచారం చేస్తున్న కొందరు వ్యక్తులను భజరంగదళ్ నాయకులు శుక్రవారం పట్టుకుని పోలీసలకు అప్పగించారు. పైన భగవద్గీత బొమ్మతో ఉండి లోపల హిందు దేవుళ్లను అపహాస్యం చేస్తు ఉన్న పుస్తకాలను కొందరు వ్యక్తులు అమ్ముతున్నారు. వాటిని కొనుగోలు చేసి భక్తులు చదివి చూడగా వాటిలో హిందువుల దేవుళ్లను కించపరుస్తూ ఉండడంతో భజరంగ దళ్ నాయకులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న నాయకులు వెంకటేశ్వరరావు, సురేంద్రదత్త తదితరులు పుస్తకాలు అమ్ముతున్న వారిని వివరాలు అడగగా వారిలో కొందరు వ్యక్తులు పరారవ్వడంతో విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అదుపులోకి తీసుకున్నారు.


పుస్తకాలు విక్రయిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు